సాక్షి ఒడిశా
గురువారం । 15 । ఆగస్టు । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ.3,55,052
బంగారం : 150 మిల్లీ గ్రాములు
వెండి : 42 గ్రాముల 250 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



గంజాయి మాఫియాతో కుమ్మక్కు

గంజాయి మాఫియాతో కుమ్మక్కైనందుకు ఏడుగురు పోలీసులపై వేటు పడింది.

- IIలో▸

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

ఒక చోరీ కేసులో నిందితుడిని అంబొదల పోలీసులు అరెస్టు చేశారు.

- IIలో▸



న్యూస్‌రీల్

చదువుతోనే అత్యుత్తమ భవిష్యత్



విద్యార్థినులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: చదువుతోనే ప్రతి ఒక్కరికీ అత్యుత్తమ భవిష్యత్ లభిస్తుందని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. సమితిలోని బయాగుడ గ్రామ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో బుధవారం ముచ్చరించారు. సెల్‌ఫోన్లు పక్కన పెట్టి, పుస్తకాలు పట్టాలని పిలుపునిచ్చారు. జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే అసలైన మంత్రం చదువే అన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి తల్లిదండ్రులను ఆశలను నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఏనుగుల బీభత్సం



ఏనుగులు కూలదోసిన ఇల్లు

భువనేశ్వర్: సుందర్‌గడ్ జిల్లా కోయిడా బలిఝుడి గ్రామంలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. నిద్రిస్తున్న సమయంలో ఏనుగులు దాడి చేసి ఇంటిని కూల్చివేశాయి. దీంతో నిద్రలో ఉన్న కుటుంబీకుల్లో ఇద్దరు మంది మృతి చెందగా, మరో ముగ్గురు మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ విచారకర సంఘటనలో తల్లి, 8 సంవత్సరాల కుమారుడు మరణించారు. తల్లి గర్భిణిగా సమాచారం. గాయపడిన ముగ్గురు బాలికల పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా ప్రస్తుతం స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

కొండచిలువ కలకలం



కొండచిలువను పట్టుకున్న రాజేంద్ర ఖోర

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల పట్టణంలో 7 అడుగుల కొండచిలువ కలకలం సృష్టించింది. బలిమెల మార్కెట్ వద్ద ఒక వ్యాపారి బుధవారం ఉదయం షాపు తెరుస్తున్న సమయంలో కొండచిలువ కనిపించడంతో భయాందోళనకు గురయ్యాడు. వెంటనే స్నేక్ క్యాచర్ రాజేంద్ర ఖోర అనే వ్యక్తికి సమాచారం ఇచ్చారు. అతను వచ్చి పామును పట్టుకున్నాడు. అనంతరం దానిని చిత్రకొండ ఘాట్ రోడ్డులోని అడవిలో వదిలేశారు.

కలప దుంగలతో ఒకరు అరెస్టు



కలప దుంగలతో నిందితుడు కుమార్

రాయగడ: ఒక పికప్ వ్యాన్‌లో అక్రమంగా కలప దుంగలను తరలిస్తుండగా గుణుపూర్ అటవీ శాఖ అధికారులు ఒకరిని పట్టుకున్నారు. వ్యాన్‌తో పాటు 80 కలప దుంగలను స్వాధీనం చేసుకుని, నిందితుడు ఎస్‌.కుమార్ స్వామిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. రేంజర్ గంగాధర్ మిశ్రో తెలిపిన వివరాల మేరకు.. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం పార్వతీపురం జిల్లాలోని కొత్తూరు ప్రాంతానికి గుణుపూర్ సమితిలోని మరమ పంచాయతీ పరిధి గుమురిగుడ అటవీ ప్రాంతం నుంచి కలప అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో మంగళవారం సాయంత్రం అటవీ శాఖ సిబ్బంది స్వప్నకుమారి చవురి, రామనాయక్ తదితరులు దాడులను నిర్వహించారు. ఈ క్రమంలో గమురిగుడ వద్ద ఆంధ్రా సరిహద్దులో పికప్ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా, అందులో 80 కలప దుంగలు పట్టుబడ్డాయి. స్వాధీనం చేసుకున్న కలప దుంగల విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని అంచనా వేశారు. అటవీ శాఖ అధికారులు దాడులను నిర్వహిస్తున్నట్లు గుర్తించిన ఒకరు సంఘటన స్థలం నుంచి పరారవ్వగా, పికప్ వ్యాన్ డ్రైవర్ కుమార్ అరెస్టయ్యాడు.

పోరాట స్ఫూర్తి.. స్వాతంత్ర్య దీప్తి




బానిసత్వపు నరకాన్ని అనుభవించిన భారతీయులు విముక్తి పొందేందుకు, దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ప్రాణాలకు లెక్క చేయకుండా పోరాటం చేశారు. తెల్లవారి తుపాకీ గుండ్లకు తమ గుండెలు అడ్డంపెట్టి విరోచిత పోరాటంలో వీర మరణం పొందారు. రాష్ట్రంలోని ఎందరో మహనీయులు స్వాతంత్ర్య పోరాటంలో చేసిన సాహసాలు అందరి మనసుల్లో చెరుగని ముద్రలు వేశాయి. నాడు వారి చేసిన త్యాగాలతో మనం ఇప్పుడు అనుభవిస్తున్న స్వాతంత్ర్యం సొంతం చేసుకున్నాం. ఆనాటి త్యాగధనులను మనసారా స్మరించుకుంటూ...

- సాక్షి నెట్‌వర్క్

- స్వాతంత్ర్య పోరాటంలో రాష్ట్ర యోధులు
- అనేక ప్రాంతాల్లో బ్రిటీష్ మారణహోమాలు
- నేటికీ పదిలమైన నాటి గుర్తులు

అరాచకాలు అడ్డుకున్న తమాదొర

మల్కన్‌గిరి: జిల్లా పోడియ సమితికి చెందిన కోయ తెగ గిరిజన నాయకుడు తమాదొర. ఈయన గిరిజనుల కోసం 1870లో బ్రిటిష్ ప్రభుత్వం చేస్తున్న అరాచాకాలను అరికట్టడంలో తన సత్తా చూపారు. అప్పటి నుంచి పోడియ, మోటు ప్రాంతాల్లో తనే రాజుగా వ్యవహరించారు. ఆ రోజుల్లో హైదారాబాద్‌కు చెందిన కల్నల్ మక్కోయిడ్ బలగాలుతో కవాత్ చేసి విఫలమయ్యారు. దీంతో తమాదొరని దొంగ దెబ్బ తీసి 1872లో మిలటరీ పోలీసులు ఆయనను హతమార్చారు.



పోడియ సమితిలో తమాదొర విగ్రహం



మత్తిలి పోలీసుస్టేషన్ ఆవరణలో లక్ష్మణ్ నాయిక్ స్థూపం



మత్తిలి సమితిలో లక్ష్మణ్ నాయిక్ విగ్రహం

సాహిద్ లక్ష్మణ్ నాయక్ వీర మరణం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి కేంద్రంలో ఒరియా జానపద కథా నాయకుడైన సాహిద్ లక్ష్మణ్ నాయిక్ గిరిజన నేతగా ఉండేవారు. ఆయన తండ్రి పదాలం నాయిక్ జైపూర్ సంస్థానంలో ముస్తాధర్(నాయుడు)గా పని చేశారు. అప్పట్లో ఆ సంస్థానం బ్రిటీష్ ప్రభుత్వం కింద పనిచేసేది. ఆ సమయంలో అక్కడి అధికారులు గిరిజనులపై అసభ్యంగా ప్రవర్తించేవారు. దీంతో వారికి వ్యతిరేకంగా నాయక్ వారి చర్యలను అడ్డుకునేవారు. అయితే తండ్రి బాటలోనే లక్ష్మణ్ నాయిక్ సైతం గిరిజనుల్లో చైతన్యం తీసుకురావడానికి విశేషంగా కృషి చేశారు. దీంతో సంభావ్య గిరిజన నాయకుడిగా మంచి గుర్తింపు వచ్చింది. అనంతరం ఆయనను అప్పటి కాంగ్రెస్ నాయకులు తమ పార్టీలో చేర్చుకున్నారు. దీంట్లో భాగంగా ఆయన జైపూర్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందారు. ఈ శిక్షణ అతడిలో జాతీయతా భావాన్ని నింపింది. గాంధీ సిద్ధాంతాలను పరిచయం చేసింది. దీంతో తొలిసారి 1936లో జరిగిన ఎన్నికల్లో కొరాపూట్ సబ్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ కోసం ప్రచారం చేశారు. 1942 ఆగస్టు 21న మహాత్మా గాంధీ పిలుపు మేరకు మత్తిలి పోలీసుస్టేషన్ ముందు శాంతియుత ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నిరసనకారులపై అప్పటి పోలీసులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 40 మృతి చెందడంతో పాటు 200 మంది గాయపడ్డారు. దీంతో దీనికి లక్షణ్ నాయకే కారణమని అతడిపై కేసు పెట్టారు. దీనిలో భాగంగా 1942 నవంబర్ 13న కోర్టు మరణ శిక్ష విధించగా, 1943 మార్చ్ 29న బరంపురం జైలులో ఉరి తీశారు. ఇప్పటికీ మల్కన్‌గిరి జిల్లాలో ఆయన చేసిన సేవలకు గానూ మత్తిలి పోలీస్‌స్టేషన్ వద్ద ఓ స్థూపం నిర్మించారు. అలాగే మత్తిలిలో ప్రజలు లక్ష్మణ్ నాయిక్ విగ్రహన్ని ఏర్పాటు చేసుకున్నారు.

సమరంలో గిరిపుత్రులు



బిన్నీస్‌పూర్ నాగావళి నది వద్దనున్న అమరవీరుల స్మృతి చిహ్నాలు

రాయగడ: స్వాతంత్ర్య సమరంలో గిరిపుత్రుల పాత్ర చాలా కీలకమనే చెప్పాలి. అవిభక్త కొరాపుట్ జిల్లా నుంచి ఎంతోమంది ఆదివాసీలు స్వాతంత్ర్య సంగ్రామంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ఆంగ్లేయులను ఎదిరించారు. ఈ కోవకు చెందిన వారిలో జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి బిన్నీస్ పూర్ ప్రాంతానికి చెందిన గిరిపుత్రుల పాత్ర ఎంతో ఉంది. వీరంతా తెల్లదొరలపై తిరగబడిన వేళ ఆ సైనిక దళం విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో బిన్నీస్‌పూర్ ప్రాంతానికి చెందిన ఏడుగురు గిరిపుత్రులు అసువులు బాసారు. వారిలో రాంసింహ కద్రక, ఝుముకా బిడిక, వీరా కద్రక, సారు తియాక, జామ పిపడిసికలు ఉన్నారు. తెల్లదొరల కాల్పుల్లో అసువులు బాసిన వారి పేరున సహీద్ పీఠం కల్యాణ సింగుపూర్‌లోని బిన్నీస్పూర్ వద్ద ఏర్పాటు చేశారు.

ఒడిశా జలియన్ వాలా బాగ్



పపడాహండి వద్ద అమర వీరుల స్మారక స్థూపం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి టురి నది ఒడ్డున బ్రిటిష్ వారి కాల్పులకు 1942 ఆగస్టు 24వ తేదీన 19 మంది స్వాతంత్ర్య సమరయోధులు అమరులయ్యారు. నాటి ఘటనను ఒడిశా జలియన్ వాలా బాగ్ ఉదంతంగా పేర్కొంటారు. 1942లో దేశవ్యాప్తంగా క్విట్ ఇండియా ఉద్యమం తీవ్రంగా జరుగుతోంది. మహాత్మ గాంధీ పిలుపు దక్షిణ ఒడిశాకి వచ్చింది. అవిభక్త కొరాపుట్ జిల్లాలోని దండకారణ్యంలో మన్యం వీరుల్లో కదలిక వచ్చింది. 1942 ఆగస్టు 14న స్థానిక సమరయోధుడు మాధవ ప్రధాని భారీ బహిరంగ సభకి పిలుపునిచ్చాడు. నబరంగ్‌పూర్ సమీపంలోని చికిలి వద్ద సభ జరగాల్సి ఉంది. సుమారు 200 మంది యోధులు గుమిగూడారు. ఇది తెలిసి పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంటనే యోధులంతా ఒక్కటై చికిలి వంతెన కూల్చివేసి పోలీసులు రాకుండా చేశారు. ఇదే సమయంలో సమరయోధుడు సోను మజ్జి నేతృత్వంలో ఉద్యమకారులు జటాబల్ వంతెన కూల్చివేశారు. 24వ తేదీన సుమారు 500 మంది ఉద్యమకారులు పపడాహండి వద్ద టురి నదిపై ఉన్న వంతెన కూల్చి వేయడానికి బయల్దేరారు. వీరికి సోనుమజ్జితో ఉన్న 200 మంది ఉద్యమకారులు జత కలిశారు. దీంతో జయపురం, నబరంగ్‌పూర్‌ల నుంచి రిజర్వ్ పోలీసు బలగాలు టురి నది ఒడ్డుకు చేరుకున్నాయి. వంతెనకి ఒక వైపు పోలీసులు, మరోవైపు ఉద్యమకారులు ఉన్నారు. ఉద్యమకారులు వంతెనపైకి రావడంతో పోలీసులు కాల్పులకు దిగారు. అక్కడికక్కడే 11 మంది చనిపోగా, మరో ఏడుగురు నబరంగ్‌పూర్ ఆస్పత్రిలో చనిపోయారు. పదుల సంఖ్యలో నదిలో పడి గల్లంతయ్యారు. అనేక మంది శాశ్వత దివ్యాంగులుగా మారారు. 140 మంది అరెస్టై జైలు పాలయ్యారు. టురి నది రక్తంతో పారిందని ప్రత్యక్ష సాక్ష్యులు పేర్కొన్నారు. స్వాతంత్ర్య అనంతరం గల్లంతైన వారి కోసం గాలించినా లాభం లేక పోయింది. 1980 ఆగస్టు 24న అదే చోట అప్పటి రాష్ట్ర మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు రాధా కృష్ణ విశ్వాస్ రాయ్, స్థానిక ఎమ్మెల్యే హబిబుల్లాఖాన్‌లు సాయుధ స్థూపం కోసం శంకుస్థాపన చేశారు. 1984 మే 23న అప్పటి రాష్ట్ర గవర్నర్ విశ్వనాథ్ పాండే ఈ స్థూపం ప్రారంభించారు.

వీర మహిళ ఖొరా పార్వతి



జయపురం: ఆంగ్లేయుల కబంద హస్తాల నుంచి భరత మాత సంకెళ్లు తెంచేందుకు ఎంతోమంది పోరాటాలు చేసి చరిత్ర పుటలకెక్కారు. అయితే చరిత్ర పుటల్లో చోటుచేసుకోలేని అనేక మంది ఉన్నారు. వారిలో గిరిజన మహిళలకు కూడా స్థానం ఉంది. వారు జరిపిన పోరాటాలు నేటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోయి భావితరాల వారికి కథలుగా అందజేస్తున్నారు. ఆంగ్లేయులతో పోరాటాలు జరిపిన కొరాపుట్ ఆదివాసీ మహిళల్లో ఖొరా పార్వతి ఒకరు. జయపురం రాజుల చేయూతతో ఆంగ్లేయ పాలకులు ఆదివాసీలపై జరిపే అకృత్యాలను, అన్యాయాలను చూసి ఆగ్రహంతో వారిపై తిరుగుబాటు జరిపింది. ఆంగ్లేయల పాలనలో అడవులపై హక్కులు కోల్పోయి బానిసలుగా బతకాల్సి వస్తోందని, అందువలన దేశం నుంచి వారిని తరిమి వేయాలని గిరిజనులకు పిలుపునిచ్చింది. 1900 సంవత్సరంలో ఒక రోజున పార్వతీ తన చంకలో బిడ్డతో, ఆమె భర్త మల్లన్న ఇతర విప్లవకారులతో కదం తొక్కుతూ ముందుకు కదిలి పాచిపెంట వద్ద ఆంగ్లేయులపై దాడి చేసింది. 1915లో చిత్రకొండ సమీపంలో ఇద్దరు విప్లవకారులను పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తీసుకెళ్లారనే వార్త విన్న ఖొరా పార్వతి, తన అనుచరులతో వారిని విడిపించేందుకు పోలీసుస్టేషన్‌పై దాడి జరిపింది. ఆమె ఇద్దరు విప్లవకారులను విడిపించి స్టేషన్‌లోని తుపాకులను దోచుకెళ్లింది. పార్వతిని పట్టుకొనేందుకు ఆంగ్లేయులు జయపురం రాజుల పాయిక సేనావాహిణి, జయపురం సైన్యాని పంపింది. చిత్రకొండ సమీప సీలేరు నది కూడలిలో ఉభయ వర్గాలకు మధ్య జరిగిన పోరాటంలో పార్వతీ, ఆమె కుమారుడు కృష్ణతో పాటు పలువురు పట్టుబడ్డారు. పట్టుబడిన వారందరినీ ఆంగ్లేయులు ఉరితీశారు.

ఆదివాసీల త్యాగాలు

జయపురం: బహుళ ఆదివాసీ కొరాపుట్ జిల్లా ప్రజలు స్వేచ్ఛాప్రియులు. అయితే ఆంగ్లేయులు మన దేశంలోకి వచ్చి రాజులపై ఆధిపత్యం పొందిన తర్వాత కొరాపుట్ ఆదివాసీ ప్రజల స్వేచ్ఛకు భంగం ఏర్పడింది. అటవీ బిడ్డలకు అడవులపై హక్కు నశించింది. అందుకు నిరసనగా గిరిజనులు పోరాటం ప్రారంభించారు. అయితే తిరుగుబాటుదారుల్లో భయం సృష్టించేందుకు ప్రజల ఎదుట విప్లవకారులను కాల్చి చంపిన సంఘటనలు కొరాపుట్ గిరిజన ప్రాంతాల్లో ఉన్నాయి. దీంతో గుణుపురం-బొడొకిమిడి ప్రాంతాల్లో 1864 జూలైలో సవర గిరిజనులు ఆంగ్లేయులపై పోరాటం ప్రారంభించారు. ఆ పోరాట ప్రభావం అన్ని ప్రాంతాలకు వ్యాపించింది. ఈ తిరుగు బాటుకు కారణమని పుట్టసింగ్ గ్రామ పెద్దను పోలీసులు అరెస్టు చేశారు. ఆయన అరెస్టుతో ఆ ప్రాంత సవర గిరిజనులు మరింత ఆగ్రహించి తమ ఆయుధాలపై ఆంగ్లేయులపై పోరాటం సాగించారు. 1864 నవంబర్‌లో ఉద్ధృతమైన పోరాటాన్ని అణచివేసేందుకు గంజాం, విజయనగరం పోలీసులను రప్పించి జయపురం సైనికులను దింపింది. అప్పటికే అరెస్టైన ఐదుగురు సవర గిరిజన నేతలను ప్రజల ఎదుట కాల్చి చంపి వారిని భయభ్రాంతులను చేశారు. అలాగే పోలీసు బలగాలు, రాజ సైనికులు పర్వత ప్రాంతాల్లో నివసించే సవర గిరిజన ప్రాంతాలను తమ అదుపులోనికి తీసుకున్నారు. పలువురుని అరెస్టు చేసి హింసించారు. వారిలో ముగ్గురు గిరిజన నేతలను 1865 జనవరిలో కాల్చి చంపారు. అలా గిరిజన గ్రామ ప్రాంతాల్లో కొనసాగుతున్న పోరాటాలు మహాత్మా గాంధీ నేతృత్వంలో కొనసాగుతున్న స్వాతంత్ర్య పోరాటాల ఉద్యమాన్ని అందుకున్నాయి. దీనికి రాధాకృష్ణ బిశ్వాసరాయ్, రాధామోహన సాహు, సదాశివ త్రిపాఠీ మొదలగు నేతలు బీజం పోశారు. వీరు మద్యం దుకాణాలు, సారా బట్టీలపై దాడులు జరుపుతూ ఆంగ్లేయులతో పోరాటం సాగిస్తున్న లక్ష్మణ నాయిక్, అతడి అనుచరులకు అండగా నిలిచారు.



స్వాతంత్ర్య సమరయోధుడు రాధాకృష్ణ బిశ్వాస రాయ్



సధాశివ త్రిపాఠీ

తొలి భారత సంగ్రామం పాయికా విప్లవం



పాయికాల తిరుగుబాటు

భువనేశ్వర్: పాయికా తిరుగుబాటు దేశ మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాటం. తొలి స్వాతంత్ర్య సమరంగా పేరొందిన 1857 సిపాయిల తిరుగుబాటుకు సుమారు 40 సంవత్సరాల ముందుగానే పాయికా విప్లవం చోటు చేసుకున్నట్లు చారిత్రాత్మక ఆధారాలు ఉన్నాయి. ఖుర్దా కేంద్రంగా 1817లో ఒడిశాలో పాయికాలు ఆంగ్లేయులను పారదోలేందుకు విజృంభించారు. అయితే భారత స్వాతంత్ర్య సమరానికి ఇదే ప్రేరణగా ఆమోదించక తప్పని పరిస్థితులు చోటుచేసుకున్నా, తొలి స్వాతంత్ర్య సమరంగా గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరించడం విచారకరం. కాగా పాయికా విప్లవాన్ని స్వాతంత్ర్యం కోసం జరిగిన తొలి పోరాటంగా గుర్తించాలని బిజూ జనతా దళ్ డిమాండ్ చేస్తోంది. అప్పటి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యతన 2017 జూలై 18న జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ మరియు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అదే సంవత్సరం జూలై 20న న్యూఢిల్లీలో పాయికా విప్లవం శతాబ్ది ఉత్సవాన్ని ప్రారంభించారు.

మంత్రి సూర్యవంశీ సుడిగాలి పర్యటన



మాట్లాడుతున్న మంత్రి సూర్యవంశీ సూరజ్

కొరాపుట్: రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్ కొరాపుట్ జిల్లాలో బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. దీనిలో భాగంగా జిల్లాలోని సిమిలిగుడ కాలేజీలో అదనపు తరగతి గదులను ప్రారంభించారు. అంతకుముందు కొరాపుట్ పట్టణంలో బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. కొరాపుట్ డీఏవీ కళాశాల పూర్వ విద్యార్థులతో సమావేశమయ్యారు. దశాబ్దాల చరిత్ర ఉన్న కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వం నిర్వహించిన హర్ ఘర్ తిరంగ కార్యక్రమం బహిరంగ సభలో ప్రసంగించారు. మంత్రి రాకను స్వాగతిస్తూ కొరాపుట్ గిరిజన సాంప్రదాయ నృత్యాలతో ఆదివాసీలు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్, ఎస్పీ అభినవ శంకర్, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో, కోట్‌పాడ్ ఎమ్మెల్యే రుపుధర్ బొత్ర, పార్టీ జిల్లా అధ్యక్షుడు సుమంత్ ప్రధాన్, కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలెటెందు రంజన్ శెఠి తదితరులు పాల్గొన్నారు.

గుడ్ మార్నింగ్ రాయగడ



రైతుల కాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కద్రక

రాయగడ: పట్టణంలోని సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటిని పరిష్కరించేందుకు రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక గుడ్ మార్నింగ్ రాయగడ అనే కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాలను కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని ఆయన తెలిపారు. ప్రతిరోజూ వార్డుల్లో పర్యటించి అక్కడి సమస్యలను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతో సహకరిస్తుందన్నారు. ఇన్నాళ్ల అధికార బీజేడీ పాలనలో భాగంగా మున్సిపాలిటీలో సమస్యలు అనేకం ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక రైతుల కాలనీల్లో ఏ వీధికి వెళ్లినా గోతులమయమైన రహదారులే తనకు దర్శనమిస్తున్నాయని, అలాగే కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు వెలుగుచూస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతీరోజూ ఉదయం కనీసం గంట నుంచి రెండు గంటల పాటు పర్యటించి ఆయా ప్రాంతాల్లో ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటానన్నారు.

క్లుప్తంగా

నీలగిరి డిప్యూటీ కలెక్టర్ అరెస్ట్

భువనేశ్వర్: ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన నీలగిరి డిప్యూటీ కలెక్టర్ పరీక్షిత్ జెనాతో పాటు అతని ముగ్గురు సహచరులను విజిలెన్స్ వర్గాలు బుధవారం అరెస్టు చేశారు. ఆస్తుల అక్రమార్జన దిశలో చేపట్టిన సోదాల్లో ఈ విషయం వెల్లడైంది. ఒడిశా మినరల్ బేరింగ్ ఏరియా డవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఓఎంబీఏడీసీ)కి చెందిన రూ.1 కోటికి పైగా ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగపరిచారు. 2021–22 మరియు 2022 మధ్య ప్రాంతంలో అభివృద్ధి పనులు చేయకుండా మయూర్‌భంజ్ జిల్లాలోని సులియాపడా మండలం బీడీవోగా బాధ్యతలు నిర్వహించిన జెనా దుర్వినియోగానికి పాల్పడినట్లు ధ్రువీకరించారు. అతని సహచరులు సులియాపడా మండలం మాజీ క్యాషియర్ దేబదత్త దాస్, సుజిత్ కుమార్ మహంతి మరియు అఖిల కుమార్ దాస్ సైతం అరెస్టు చేశారు. బరిపద బింధాని కంప్యూటర్ యజమాని నిగమ్ ప్రసాద్ పరిడా, బరంపురం త్రిలోచన్ ట్రేడర్స్ యజమాని దిబ్యాలోచన్ దాస్ మరియు ప్రభుత్వ నిధులు పొందిన మనోజ్ కుమార్ దేవ్‌తో సహా ఇతర నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

'పద్ధతిగా జరగాలి'



మాట్లాడుతున్న ప్రతాప్ కేసరి దేవ్

భువనేశ్వర్: శాసనసభలో కొత్తగా ఎన్నికైన వారికి శిక్షణ కార్యక్రమంపై విపక్ష బిజూ జనతా దళ్ స్పందించింది. సభా మర్యాదకు పట్టం గట్టే రీతిలో ఈ కార్యక్రమం జరగాలని తెలిపింది. ప్రజా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాలు ముఖ్యమంత్రి లేదా స్పీకర్ ప్రారంభించడం సభా పరంపరగా పేర్కొన్నారు. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి ప్రకటన ప్రకారం బయటి వ్యక్తులు సభా కార్యక్రమానికి హాజరుకావడం సరికాదన్నారు. ఈ యోచన విరమించుకోకుంటే బీజేడీ ఈ కార్యక్రమానికి హాజరుకాదని బీజేడీ అధికార ప్రతినిధి ప్రతాప్ కేసరి దేవ్ స్పష్టం చేశారు.

పేలిన వంట గ్యాస్

భువనేశ్వర్: వంట చేస్తుండగా గ్యాస్ బండలో మంటలు చెలరేగిన ఘటన ఎయిర్ ఫీల్డ్ పోలీస్ ఠాణా ప్రాంగణంలో చోటుచేసుకుంది. ప్రమాదాన్ని గుర్తించిన పోలీసులు హుటాహుటిన గ్యాస్ బండని డాబా పైకి తరలించారు. కాసేపటి తర్వాత పేలడంతో పెను ముప్పు తప్పింది.

భర్తపై భార్య స్టింగ్ ఆపరేషన్

భువనేశ్వర్: హోటల్ గదిలో తన భర్తనునొక మహిళ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఇద్దరు యువతులతో కలిసి హోటల్ బస చేసిన భర్త వ్యవహారం పోలీసుల సమక్షంలోనే బట్టబయలు చేసింది. స్థానిక ఇన్ఫోసిటీ పోలీస్ ఠాణా పరిధిలో బుధవారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.

నందన్‌కానన్‌లో సింహం మృతి



మృతి చెందిన సింహం

భువనేశ్వర్: నగర శివారులోని బారంగ్ నందన కానన్‌లో క్రిస్ సింహం బుధవారం మృతి చెందింది. 2004లో నందన్‌కానన్‌లో ఇది జన్మించింది. 2 పిల్లలకు జన్మనిచ్చింది. జూలై 26 నుంచి క్రిస్ వద్ధాప్య సంబంధిత అనారోగ్య సంబంధిత చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచింది.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



పోలీసులకు పట్టుబడిన నిందితుడు

రాయగడ: ఒక చోరీ కేసులో నిందితుడిని అంబొదల పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి జిల్లాలోని అంబొదల పోలీస్‌స్టేషన్ పరిధి డిమిరిగుడ గ్రామానికి చెందిన నీలకంఠ కొరొకొరియాగా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. గత నెల జూలై 19వ తేదీన డిమిరిగుడలో ఉన్నటువంటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చోరీ జరిగింది. పాఠశాలలోని కంప్యూటర్లు, తదితర పరికరాలు దొంగతనానికి గురయ్యాయి. ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం జ్ఞానరంజన్ సాహు జూలై 22వ తేదీన అంబొదల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, అతని నుంచి రెండు కంప్యూటర్లు, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టుకు తరలించారు. అయితే ఇదే కేసులో మరో ఇద్దరు నిందితులు ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని, వారికోసం గాలిస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

శభాష్ కిరోడ్ చంద్ర

- మూఢ నమ్మకాలపై ప్రేమగా తిరుగుబాటు
- చిన్నారిని ఎత్తుకొని ఆస్పత్రికి తరలింపు



బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని తదితరులు

కొరాపుట్: మూఢ నమ్మకాలతో ప్రాణాలు పోగొట్టుకుంటున్న గిరిజనులతో ప్రేమగా వ్యవహరించి ఆస్పత్రులకు తరలించిన ఘటన నబరంగ్‌పూర్‌లో చోటుచేసుకుంది. జిల్లాలోని నందాహండి బీడీవో కిరోడ్ చంద్ర సాహు డయేరియాతో బాధపడుతున్న దండసేనగుడను బుధవారం సందర్శించారు. ఆ గ్రామంలో డయేరియాతో ఇప్పటికే ముగ్గురు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. మరికొంతమంది తమ ఇళ్ల వద్దనే చికిత్స పొందుతున్నారు. మంత్రగత్తెల మాటలు నమ్మి ఆధునిక వైద్యానికి దూరంగా ఉన్నారు. ఆస్పత్రికి వెళ్తే చనిపోతారని గిరిజనులు నమ్ముతున్నారు. దీంతో చేసేదేమీలేక అధికారులు గిరిజనుల ఇళ్ల ముందు శిబిరాలు ఏర్పాటు చేసుకొని వైద్యం అందజేస్తున్నారు. అయితే కొంతమంది బాధితుల పరిస్థితి విషమంగా ఉందని, ఆస్పత్రికి తరలించకపోతే ప్రమాదమని వైద్య సిబ్బంది బీడీవోకి తెల్పి చెప్పారు. దీంతో గిరిజనులను ఒప్పించడానికి చూసినా వారు ఇంటి నుంచి ఆస్పత్రికి తీసుకెళ్లడానికి మెరాయించారు. దీంతో బీడీవో అనూహ్యంగా డయేరియా బాధిత చిన్నారులను స్వయంగా మోసుకొని తన వాహనంలో ఎక్కించుకొని ఆస్పత్రికి బయల్దేరారు. దీంతో మిగతావారు కూడా బీడీవో వాహనం ఎక్కి ఆస్పత్రికి చేరుకున్నారు. నందాహండి సమితి కేంద్రం డొంగురబజలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రస్తుతం డయేరియా బాధితులకు నాణ్యమైన చికిత్స అందజేస్తున్నారు. అంతకుముందు బాధిత గ్రామానికి వెళ్లిన నబరంగ్‌పూర్ మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అతనితో వచ్చిన జిల్లా పరిషత్ సభ్యుడు అరుణ్ మిశ్ర కూడా బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు.



చిన్నారులను వాహనం వద్దకు తీసుకెళ్తున్న బీడీవో కిరోడ్ చంద్ర సాహు

ఎయిమ్స్ రెసిడెంట్ వైద్యుల ఆందోళన



ఎయిమ్స్ ఆవరణలో రెసిడెంట్ వైద్యుల ఆందోళన

భువనేశ్వర్: స్థానిక ఎయిమ్స్ రెసిడెంట్ వైద్యులు ఆందోళనకు దిగారు. బుధవారం విధులు బహిష్కరించారు. వైద్యులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. కోల్‌కత్తా ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌లో 31 ఏళ్ల పోస్టు గ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్‌పై లైంగిక వేధింపులు, హత్య ఘటనకు వ్యతిరేకంగా ఈ ఆందోళన చేపట్టినట్లు ఎయిమ్స్ అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాస్ త్రిపాఠి తెలిపారు. సీనియర్ రెసిడెంట్, జూనియర్ రెసిడెంట్, వైద్య విద్యార్థులు ఆందోళనకు దిగారు. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు యథావిధిగా విధులు నిర్వహిస్తున్నారు. రోగుల బాగోగులను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. తలకు తెల్లని పట్టీ, చేతులకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శించారు. ఆందోళనకు దిగిన సీనియర్, జూనియర్ రెసిడెంటు వైద్యులు అత్యవసర సేవలతో పాటు ఓపీడీ, ఐపీడీ, ఓటీల్లో విధులను బహిష్కరించారు. వైద్యులపై దాడులు నివారించి బాధితులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. వైద్యులకు రక్షణ కల్పించాల్సి ఉందన్నారు. కోల్‌కత్తాలో ట్రైయినీ వైద్యురాలిపై జరిగిన సంఘటనపై సరైన విచారణ జరిపి వైద్యులకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆందోళనకు దిగారు.

రాయగడలో మంత్రి సంపద్ పర్యటన



మంత్రి సంపద్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

రాయగడ: రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి సంపద్ చరణ్ స్వయి బుధవారం రాయగడలో పర్యటించారు. ముందుగా ఆయన సదరు సమితికి పది కిలోమీటర్ల దూరంలోని జేకేపూర్‌లోని మిల్ యజమానులతో సమావేశమయ్యారు. అనంతరం కొలనార సమితి పరిధి భుజబల్‌లో ఉన్నటువంటి మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని మెగా ఫుడ్‌పార్క్‌ను సందర్శించారు. గత ప్రభుత్వ హయాంలో మెగాఫుడ్ పార్క్ ఏర్పాటుకు సంబంధించి నిధులు మంజూరైనప్పటికీ, పార్క్ ఇంతవరకు ప్రారంభమవ్వకపోవడానికి గల కారణాలు తెలుసుకున్నారు. మిట్స్ ఇంజినీరింగ్ సంస్థ అధినేత బాలకృష్ణ పండాతో మాట్లాడి ఫుడ్ పార్క్ ప్రారంభానికి సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. పార్క్ ప్రారంభమైతే ఎంతోమందికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆకాంక్షించారు.

హర్ ఘర్ తిరంగ ర్యాలీలో మంత్రి

అనంతరం బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన హర్‌ఘర్ తిరంగ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక జగన్నాథ స్వామి మందిరం నుంచి ప్రారంభమైన ర్యాలీ సెరిగుడలోని బీజేపీ కార్యాలయం వరకు సాగింది. ఈ ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కాశీరాం మాఝి, యువ నాయకుడు ప్రతాప్ పువ్వల తదితరులు పాల్గొన్నారు. కాగా స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరగనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి గురువారం పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు.

మావోయిస్టుల ఎదురు కాల్పులు

కలహండి – కొందమాల్ జిల్లాల మధ్య అడవి ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. బుధవారం బలిగుడ పోలీస్ స్టేషన్ పరిధి పంగురు మిలా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్వాతంత్ర్య దినోత్సవాలు సందర్భంగా ఈ ప్రాంతంలో భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. పోలీసుల రాక చూసి మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారు. దీంతో వారికి దీటుగా పోలీసులు బదులిచ్చారు. ఈ కాల్పులు సుమారు మూడు గంటలు పాటు జరిగాయి. అనంతరం అక్కడికి వెళ్లి పరిశీలించగా మావోయిస్టుల క్యాంప్ ఉన్నట్లు గుర్తించారు. వారి దుస్తులు, నిత్యవసర వస్తువులు ఉన్నాయి. ఈ ఘటనలో పలువురు మావోయిస్టులు గాయపడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ ప్రాంతం లో గాలింపు ముమ్మరం చేయడానికి అదనపు బలగాలు తరలిస్తున్నారు. – కొరాపుట్






మావోయిస్టుల క్యాంపు దృశ్యాలు

13 మందికి రాష్ట్రపతి అవార్డులు



ప్రాణకృష్ణ లెంక | బాబులా సమల్ | హరి బంధు బాత్రా | కౌశిక కుమార్ నాయక్ | ప్రద్యుమ్న కుమార్ నందా



ప్రమోద కుమార్ మొహంతా | సురేష్ దేవదత్తా సింగ్ | సచ్చిదానంద రథ్ | తోఫాన్ బెహెరా | కవితా సాహు



సంజుక్తా పట్నాయక్ | సురేష్ చంద్ర రౌత్ | సనత్ కుమార్ నాథశర్మ

భువనేశ్వర్: రాష్ట్ర పోలీసు సిబ్బందిలో 13 మంది ఈ ఏడాది రాష్ట్రపతి పోలీసు పతకాలను అందుకోనున్నారు. ఇద్దరు ఒడిశా పోలీసు సిబ్బంది విశిష్ట సేవ కోసం రాష్ట్రపతి పతకం (పీఎస్‌ఎం) అందుకుంటారు. మరో 11 మంది మెరిటోరియస్ సర్వీస్ కోసం రాష్ట్రపతి పతకం (ఎంఎస్‌ఎం)తో సత్కరించబడతారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సురేష్ దేవ్ దత్తా సింగ్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సచ్చినంద రథ్‌లను విశిష్ట సేవకు (పీఎస్‌ఎం) గాను రాష్ట్రపతి మెడల్‌తో సత్కరించనున్నారు. డిప్యూటీ కమాండెంట్ కౌశిక కుమార్ నాయక్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సనత్ కుమార్ నాథశర్మ, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కవితా సాహు, కానిస్టేబుల్ ప్రమోద కుమార్ మొహంతా, సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రద్యుమ్న కుమార్ నందా, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ బాబులా సమల్, కానిస్టేబుల్ సంజుక్తా పట్నాయక్, ఇన్‌స్పెక్టర్ హరిబంధు భాత్రా, హవల్దార్ తోఫాన్ బెహెరాలు మెరిటోరియస్ సర్వీస్ (ఎంఎస్‌ఎం) కోసం రాష్ట్రపతి పతకం అందుకుంటారు. కంపెనీ కమాండర్ ప్రకాష్ చంద్ర సాహూ హోం గార్డు మెరిటోరియస్ సర్వీస్ (ఎంఎస్‌ఎం) మరియు సివిల్ డిఫెన్స్ వాలంటీర్ సిమాంచల్ కుండూ సివిల్ డిఫెన్స్ మెరిటోరియస్ సర్వీస్ (ఎంఎస్‌ఎం) రాష్ట్రపతి పురస్కారం అందుకుంటారు.

డిమాండ్లు నెరవేర్చకుంటే విధుల బహిష్కరణ

- రాష్ట్ర ప్రభుత్వానికి నర్సింగ్ అధికారుల హెచ్చరిక

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో నర్సింగ్ అధికారులు తమ 10 ప్రధాన డిమాండ్ల సాధన కోసం బుధవారం నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చడంలో విఫలమైతే ఈనెల 27 నుంచి విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. తమ సమస్యలు, డిమాండ్లని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. ఒడిశా నర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం నుంచి డిమాండ్లకు మద్దతుగా ఆందోళనకు దిగినట్లు ఒడిశా నర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కార్యదర్శి సరోజినీ జెనా తెలిపారు. తమ డిమాండ్లను నెరవేర్చకుంటే నిలిపివేస్తామని తెలిపారు. రోగుల సంరక్షణ సేవలు ప్రభావితం కాకూడదనే ఉద్దేశంతో ఆగస్టు 20 వరకు నల్లబ్యాడ్జీలు ధరించి, ఆగస్టు 21 నుంచి రోగుల సేవలు దెబ్బతినకుండా నిరసన, ఆగస్టు 23న భువనేశ్వర్‌లో భారీ ర్యాలీ నిర్వహించి అంచెలంచెలుగా ఆందోళన ఉద్ధృతం చేయనున్నట్లు వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ గోడుపై సానుకూలంగా స్పందించాలని కోరారు.

రాజ్యసభ ఎన్నికల నోటిఫికేషన్ జారీ

భువనేశ్వర్: రాష్ట్రంలో ఒక స్థానానికి జరగాల్సిన రాజ్యసభ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ అయింది. నామినేషన్ల సమర్పణకు ఆగస్టు 21 చివరి తేదీ కాగా, పోటీ నుంచి వైదొలిగేందుకు దరఖాస్తుల ఉపసంహరణ గడువు ఆగస్టు 27తో ముగుస్తుంది. సెప్టెంబర్ 3న పోలింగ్, ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ రీండో వార్డు సాయిబుల కాలనీకి చెందిన వివాహిత షేక్ కుమారి అదృశ్యమైంది కుటుంబీకులు ఫిర్యాదు చేసినట్టు పోలీసులు బుధవారం తెలిపారు. ఈ మేరకు కేసునమోదు చేశామన్నారు. ఈమెకు మతిస్థిమితం సరిగ్గా లేదని.. ఆచూకీ తెలిసిన వారు 97046 66402 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

గంజాయి మాఫియాతో కుమ్మక్కు

- ఏడుగురి పోలీసులపై వేటు

కొరాపుట్: గంజాయి మాఫియాతో కుమ్మక్కైనందుకు ఏడుగురు పోలీసులపై వేటు పడింది. కొరాపుట్ జిల్లా మాచ్‌ఖండ్ పోలీస్‌స్టేషన్‌లో ఆరుగురు, లమ్తపుట్ పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల ఒక వాహనంలో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు ఉన్నతాధికారులకు సమాచారం వచ్చింది. దీంతో వారు స్థానిక పోలీసుస్టేషన్లకు సమాచారం ఇచ్చారు. అయితే స్థానిక పోలీసులు గంజాయి మాఫియా వ్యక్తుల నుంచి రూ.5 లక్షలు లంచం తీసుకొని, వారిని వదిలి వేశారని వార్తలు వెలువడ్డాయి. దీంతో సదరన్ వెస్టర్న్ రేంజ్ డీఐజీ చరణ్ సింగ్ మీనా మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో తక్షణమే దర్యాప్తు చేయాలని కొరాపుట్ జిల్లా ఎస్పీ అభినవ శంకర్‌ని ఆదేశించారు. వెనువెంటనే ఎస్పీ ఆయా స్టేషన్లకి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. లోపలికి ఎవరినీ రానివ్వకుండా స్టేషన్ల వద్ద ఐఆర్‌బీ దళాలను మోహరించారు. పోలీస్‌స్టేషన్‌ని పోలీసులే మూసివేసి ప్రజలను అనుమతించని పరిస్థితి ఏర్పడింది. అనంతరం పటిష్ట బందోబస్తు మధ్య నిందిత పోలీసులను కొరాపుట్ జిల్లా కేంద్రంకి తరలించారు. అక్కడ విచారణ ముగించారు. ఆరోపణలు నిజం అని తేలడంతో ముగ్గురు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు కానిస్టేబుళ్లని సస్పెండ్ చేశారు. మరో ఇద్దరు హోం గార్డులను విధులను తప్పించారు. ఈ చర్య రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ వర్గాల్లో గుబులు పుట్టిస్తోంది. ఇంతవరకు రాష్ట్ర పోలీస్ చరిత్రలో ఇంత ఎక్కువ మందిపై చర్యలు తీసుకోలేదు. దీంతో సంచలనంగా మారింది. ఈ ఘటనపై ఉన్నతాధికారులు అధికారికంగా స్పందించడానికి నిరాకరిస్తున్నారు.



మాచ్‌ఖండ్ పోలీస్‌స్టేషన్

సంక్షిప్తంగా...

కార్యాలయాలు ప్రారంభం



కార్యాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అనిల్ తదితరులు

కొరాపుట్: బ్రహ్మపుర నగరంలో ప్రజలకు అందుబాటులో ఉండడానికి ఎంపీ, ఎమ్మెల్యేల కార్యాలయాలు బుధవారం ప్రారంభమయ్యాయి. గాంధీ నగర్ ప్రాంతంలోని మహామయి కళాశాల సమీపంలో ఆ ప్రాంత సీనియర్ సిటిజన్లు చేతులమీదుగా కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీకి చెందిన బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండడానికే ఈ కార్యాలయాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విస్తృత పర్యటన



పార్క్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్

కొరాపుట్: బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్ కుమార్ తన నియోజకవర్గంలో బుధవారం విస్తృత పర్యటన చేశారు. బ్రహ్మపురలోని 19వ వార్డులో కళాసి వీధి, అన్నపూర్ణ మార్కెట్, మాచి వీధి, దుభా వీధుల్లో పర్యటించారు. అక్కడ ప్రజలకు జాతీయ పతాకాలు అందజేశారు. రామ లింగేశ్వర్ పార్క్‌లో వనయజ్ఞంలో పాల్గొని మొక్కలు నాటారు. గాంధీ విగ్రహం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ఉత్తరేశ్వర్ దేవాలయం వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో గంజాం జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ సుభాష్ సాహు తదితరులు పాల్గొన్నారు.

నిషాముక్త భారత్ అభిజాన్



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రాయగడ: స్థానిక అటానమస్ కళాశాలలో నిషాముక్త భారత్ అభిజాన్ కార్యక్రమం బుధవారం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ బబిలత షరఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటకం అలరించింది. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు.

వ్యాస రచన పోటీలు



ర్యాలీలో పాల్గొన్న అధికారులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో డ్రగ్స్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్ బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా కలెక్టర్ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సామాజిక భద్రతా, వికలాంగుల సాధికారత అధికారి నిర్మల్ దారువ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణలక్ష్మిగా కొత్తమ్మతల్లి

కోటబొమ్మాళి: శ్రావణమాసంలో శ్రావణ శుక్రవారం, రాఖీపౌర్ణమి ముందు వచ్చే గురువా రం సందర్భంగా కోటబొమ్మాళిలోని కొత్తమ్మతల్లికి పలు రకాల గాజులతో శ్రావణ లక్ష్మిగా బుధవారం అలంకరించారు. ఆలయ ఈవో వాచకచర్ల రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ పూజారి కమ్మకట్టు రాజేష్ అమ్మవారికి గాజులతో అలంకరణ చేశారు. గురువారం శ్రావణలక్ష్మిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

క్లుప్తంగా

ముఖ్య అతిథిగా మంత్రి బిభూతి భూషణ్

పర్లాకిమిడి: పట్టణంలో జరగనున్న 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా, వాణిజ్య, గనుల మంత్రి బిభూతీ భూషణ్ జెన్నా విచ్చేయనున్నారు. ఆయన గజపతి స్టేడియానికి ఉదయం 9.15 గంటలకు విచ్చేసి జాతీయ పతాకం ఎగురవేస్తారని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ తెలియజేశారు.

కత్తల కవిటిలో స్వచ్ఛభారత్

పర్లాకిమిడి: గుసాని సమితి కత్తలకవిటి పంచాయతీలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం బుధవారం చేపట్టారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కత్తలకవిటి సర్పంచ్ సైలాడ లింగరాజు, నాయిబు సర్పంచ్ సంజుక్తా రోథో తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ వైద్యులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి తులసి పాహడ్‌పై ఉన్న మారుమూల గ్రామాల్లో 2వ బెటాలియన్ బీఎస్ఎఫ్ జవాన్లు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా తులసి, కిర్మటీ, చెర్కోట్ల, దండిపోదర్ గ్రామాలకు చెందిన వందలాది మంది గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. అనంతరం నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

పథకాలు ప్రజలకు చేరువవ్వాలి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి స్వయి తదితరులు

రాయగడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు చేరువవ్వాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి సంపద్ చరణ్ స్వయి అన్నారు. రాయగడ పర్యటనకు విచ్చేసిన ఆయన స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లాలో సమస్యలు, అమలవుతున్న పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో కలెక్టర్ ఫరూల్ పట్వారి, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో, ఏడీఎం భాస్కరరైతా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జయపురం: కేంద్ర, రాష్ట్ర పథకాలపై కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. జయపురం సమితి టంకువ గ్రామంలో నిర్వహించిన ఈ శిబిరానికి జిల్లా న్యాయసేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సమితి సమాజ సురక్షా అధికారి కె.ఎస్.నిశా, ప్రభుత్వ లేబర్ విభాగ అధికారి చైతన్య ప్రసాద్ మరియు, సమితి సహాయ విద్యాధికారి కైలాస చంద్ర శతపతి తదితరులు పాల్గొన్నారు.

17న పార్వతీపురంలో జాబ్ మేళా

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణంలో ఈ నెల 17వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఆర్.వహీదా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించే నిమిత్తం హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ్ లిమిటెడ్ కంపెనీల సౌజన్యంతో జాబ్ మేళాను ఏర్పాటు చేశామని చెప్పారు. 270 ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయని, 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి, డిగ్రీ అర్హత గల యువత అర్హులని పేర్కొన్నారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 17వ తేదీన ఉదయం 10:30 గంటల నుంచి జాబ్‌మేళా జరుగుతుందని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తిగల యువత డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సీఎస్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో జాబ్ సీకర్ లాగిన్‌లో నమోదు కావాలని సూచించారు.

ఎస్సైలకు బదిలీలు

విజయనగరం క్రైమ్: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో పనిచేస్తున్న ఎస్సైలకు స్థానచలనం కల్పిస్తూ ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బొండపల్లి ఎస్సైగా పనిచేస్తున్న కె.లక్ష్మణరావును గజపతినగరానికి.. గజపతినగరం ఎస్సైగా పనిచేస్తున్న యు.మహేష్‌ను బొండపల్లికిర బదిలీ చేశారు. పీటీసీలో పనిచేస్తున్న డి.సాయికృష్ణను గంట్యాడకు.. విజయనగరం టూటౌన్ ఎస్సై జి.రాజేష్‌ను బుధరాయవలసకు.. బాడంగి ఎస్సై ఆర్.జయంతిని పెదమానాపురం పీఎస్‌కు.. సంతకవిటి ఎస్సై షేక్ శంకర్‌ను వంగరకు, అదేవిధంగా పూసపాటిరేగ ఎస్సై ఎ.సన్యాసి నాయుడును డెంకాడకు బదిలీ చేశారు.



భువనేశ్వర్: హర్ ఘర్ తిరంగా ప్రచారంలో సీఎం మోహన్ చరణ్ మాఝీ



భువనేశ్వర్: కాంతులీనుతున్న తూర్పు కోస్తా రైల్వే ప్రధాన కార్యాలయం



జయపురం: ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

స్వాతంత్ర్య సందడి

స్వాతంత్ర్య వేడుకలకు రాష్ట్రం సిద్ధమైంది. గురువారం జరగనున్న వేడుకల కోసం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు ముస్తాబయ్యాయి. దీనిలో భాగంగా పలుచోట్ల బుధవారం నిర్వహించిన మూడు రంగుల జెండాలతో ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతి ఒక్కరి ఇంటిపై జాతీయ జెండా ఎగురువేయాలని ప్రముఖులు పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



భువనేశ్వర్: పట్నగొడొ ప్రాంతంలో ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్



కొరాపుట్‌లో కలెక్టర్ వి.కీర్తి వాసన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కొరాపుట్: నబరంగ్‌పూర్ మెయిన్ రోడ్డులో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ శుభంకర్ మహాపాత్రో తదితరులు



భువనేశ్వర్: ఖుర్దాలో ఎంపీ అపరాజిత షడంగి తదితరుల ర్యాలీ



భువనేశ్వర్: భారీ జాతీయ పతాకంతో నగర వీధుల్లో ఊరేగింపు



కొరాపుట్: సునాబెడా ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాజేంద్ర కుమార్ పాత్రో తదితరులు



జయపురం: జాతీయ పతాకంతో పోస్టల్ ఉద్యోగుల ర్యాలీ



పర్లాకిమిడి: ఇళ్ల వద్ద జాతీయ జెండా ప్రదర్శన



పర్లాకిమిడి: పట్టణంలో జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కొరాపుట్: చందాహండిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



భువనేశ్వర్: అధికారిక నివాస భవనం ఆవరణలో జాతీయ పతాకం ఆవిష్కరించిన ఖుర్దారోడ్ డీఆర్‌ఎం హెచ్.ఎస్.బజ్వా



భువనేశ్వర్: సైకిలు ర్యాలీతో హర్ ఘర్ తిరంగా ప్రచారం



కొరాపుట్: పపడాహండి అమరుల స్థూపం నుంచి స్థానికుల ర్యాలీ

ఏర్పాటు చేయాలి



కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కొసాగుమ్మ సమితి కేంద్రంలో కోర్టు ఏర్పాటు చేయాలని స్థానికులు ఆందోళనకి దిగారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రంని ముఖ్యమంత్రికి పంపాలని కోరుతూ సమితి కార్యాలయంకి అందజేశారు. గత ప్రభుత్వం జేఎంఎఫ్‌సీ కోర్టుని కొసాగుమ్మ సమితి కేంద్రంలో ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కానీ అధికారులు మాత్రం సమితిలో రెండో పెద్ద పట్టణం కొడింగాలో ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై కొసాగుమ్మ వాసులు భగ్గుమన్నారు.

బైక్ ర్యాలీ



మల్కన్‌గిరి: జిల్లాలోని ఎంవీ 3 గ్రామం వద్దనున్న బీఎస్ఎఫ్ క్యాంప్‌కు చెందిన జవాన్లు హర్‌ఘర్ తిరంగలో భాగంగా బైక్, సైకిల్ ర్యాలీ బుధవారం నిర్వహించారు. ర్యాలీని బీఎస్ఎఫ్ డీఐజీ విజయ్ సిన్హా ప్రారంభించారు. అనంతరం క్యాంప్ అవరణలో మొక్కలు నాటారు.

అమరులకు నివాళి



కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి కృష్ణచంద్ర పాత్రో విచ్చేశారు. దీనిలో భాగంగా పపడాహండి సమీపంలో టురి నది వద్ద బ్రిటిష్ కాల్పులు జరిగిన ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాల సంఘం అధ్యక్షుడు మున్నా త్రిపాఠి, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి తదితరులు పాల్గొన్నారు.

లాఠీ పట్టాల్సిందే..!

- విధిగా గ్రామ సందర్శన చేయాలి
- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: విధి నిర్వహణలో భాగంగా పోలీస్ సిబ్బంది తప్పనిసరిగా లాఠీ పట్టాల్సిందేనని, విధి నిర్వహణలో లాఠీని తమవెంట తీసుకువెళ్లాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలు జారీచేశారు. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న అధికారులతో మాసాంతర నేర సమీక్షా సమావేశాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై అఘాయిత్యాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న నిర్జన ప్రాంతాలను, రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను వేర్వేరుగా గుర్తించి, ఆయా ప్రాంతాల్లో నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహిళల రక్షణకు మహిళా బీట్లు ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో వేయాలని, వారు స్కూల్స్, కళాశాలలు, పరిశ్రమలు, ముఖ్య కూడళ్లు, హాస్టల్స్‌ను సందర్శించి, మహిళలతో మమేకమై, వారి భద్రతకు అండగా ఉండే చట్టాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామసందర్శనలను డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది తప్పనిసరిగా చేయాలని, స్థానిక నాయకులు, ప్రజలతో మమేకం కావాలని, గ్రామంలో సమస్యలు గుర్తించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సమస్యలను గుర్తించి, ప్రాథమిక స్థాయిలోనే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. డయల్ 100 కాల్స్‌పై తక్షణమే స్పందించి, సంఘటనా స్థలానికి చేరుకుని, పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఆధారాలు సేకరించాలి

తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులు నమోదైతే క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్ సహకారంతో, నేరస్థలంలో ఆధారాలు సేకరించాలని చెప్పారు. ఇప్పటి వరకూ వినియోగంలో ఉన్న సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసే విధంగా, ప్రధాన మార్గాలను కవర్ చేసే విధంగా ఏర్పాటుచేయాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం.సాల్మన్, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్. చక్రవర్తి, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్ పాల్గొన్నారు.

పోలీస్ ప్రతిష్ట పెంచేలా వ్యవహరించాలి

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ



మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ



హాజరైన పోలీస్ అధికారులు

విజయనగరం క్రైమ్:

పోలీస్ ప్రతిష్టను పెంచే విధంగా అధికారులు, సిబ్బంది వ్యవహరించాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ సూచించారు. విశాఖ రేంజ్ డీఐజీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాకు వచ్చిన ఆయనకు ఎస్పీ వకుల్ జిందాల్, ఐదో బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్, ఇతర పోలీసు అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి, స్వాగతం పలికారు. అనంతరం డీఐజీ జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారులతో సమావేశమై, పోలీసు శాఖ ప్రతిష్టను పెంచేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది వ్యవహరించాల్సిన తీరు, నిర్వహించాల్సిన విధుల పట్ల దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హోంగార్డ్స్ నుంచి ఐపీఎస్ అధికారుల వరకూ ఎంతో శ్రమించి, పోలీసుశాఖ ప్రతిష్టను ఇనుమడింపజేసి, దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంచి పేరును తీసుకువచ్చారని, ఆ ప్రతిష్టను మరింతగా పెంచేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది సత్ప్రవర్తనతో మెలగాలని కోరారు. పోలీస్‌స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే నిరుపేదలు, మహిళలు, వృద్ధుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారికి అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను శ్రద్ధగా విని, న్యాయం చేసేందుకు చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సూచించారు.

సోషల్ మీడియాపై నిఘా

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టి, వ్యక్తుల మనోభావాలను కించపరిచే వ్యక్తులపై నిఘా ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు అన్ని ముందస్తు చర్యలను చేపట్టడంతో పాటు, ప్రజలకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో నమోదవుతున్న నేరాల తీరును శాంతి భద్రతల అంశాలను, వాటి పరిరక్షణకు జిల్లా పోలీసుశాఖ చేపడుతున్న చర్యలను డీఐజీకి వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం.సాల్మన్, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి, డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, పలువురు సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల వాహనాలు కండిషన్‌లో ఉండాలి



జిల్లా రవాణాశాఖ అధికారి ఎం శశి కుమార్

పార్వతీపురంటౌన్: పాఠశాలల వాహనాలు కండిషన్‌లో ఉండాలని జిల్లా రవాణాశాఖ అధికారి ఎం.శశి కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రోడ్ ప్రమాదాల నివారణకు విద్యాసంస్థల యాజమాన్యం స్కూల్ బస్సుల విషయంలో పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని విద్యా సంస్థల యాజమాన్యాలు కింద సూచించిన నియమాలను పాటించాలని పేర్కొన్నారు. వాహనం(స్కూల్‌బస్సు) పూర్తి సామర్థ్యం(కండిషన్)లో ఉండాలి. డ్రైవర్, పర్యవేక్షకుడు వాహనంలో అందుబాటులో ఉండాలి. వాహనం బయలుదేరే ముందు పరిశీలించి ఏమైనా లోపాలు ఉంటే సరిదిద్దుకుని స్టూడెంట్స్‌తో ప్రయాణించాలి. డ్రైవర్ మొబైల్ ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనం నడపరాదు. వాహనంలో పరిమితికి మించి ప్రయానించరాదు. స్కూల్ బస్సులో ప్రథమ చికిత్స బాక్స్ తప్పనిసరిగా ఉండాలి. స్కూల్ బస్సు బయలుదేరే ముందు లైట్స్/వైపర్స్/టైర్స్/బ్రేక్ కండిషన్ చూసుకుని బయలు దేరాలి. స్కూల్ ఆటోలో పరిమితికి మించి (6 గురు) ప్రయాణించరాదు. ఈ నిబంధలను విధిగా పాటించి తమ వాహనాలకు ఫిట్‌నెస్‌సర్టిఫికెట్ పునరుద్ధరణ చేయించి పరిమితికి మించకుండా విద్యార్థులను తీసుకు వెళ్లాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపే స్కూల్ ఆటో రిక్షాలపై జిల్లా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.